# 63. టంగ్ క్లీనర్

ఆ సాయంకాలం నేను ఇంటికెళ్లగానే "సదాశివరావు గారొస్తున్నారు!" అంది తలుపు తెరుస్తూ మా ఆవిడ. నేను చెప్పులు విడిచేలోగానే పోస్టుకార్డొకటి చేతిలో పెట్టింది. "సరేలే, చెప్పేవుకదా!" అని ఆ ఆటోమేటిక్ డోర్ మూయ్యబోతూ వుంటే "తలుపేసేస్తారేమిటి? ఆయనొస్తున్నారు, అరుగో!" అని నా వెనక్కి చూపించింది.

" ఈతలుపుకి లెన్స్ పెట్టించేరు కదా. ఇందులోంచి చూస్తే తలుపు దగ్గిరిసా మీరూనూ, దూరంగా గేటు తెరుచుకుని పార్కింగుస్పేస్ లోంచి వస్తూ సదాశివరావు గారూనూ కనబడ్డారు. రాగానే ఉత్తరాలేమైనా వొచ్చాయా-అని అడుగుతారు కదా-అని ఉత్తరం ఇచ్చేను" అని ఏమిటేమిటో వివరణలు ఇచ్చేస్తోంది మా ఆవిడ. ఇంతలోకి సదాశివరావు రానే వచ్చాడు.

దాంతో, "అదేమిటోయి, ఉత్తరమైనా రాయకుండా వచ్చేసేవు?" అనడానికి వీల్లేకుండా పోయింది. "ఎప్పుడేమిటి, రావడం?" అని కూడా అడగడానికి ఛాన్సు లేదు. అంచేత "రా, రా! బహుకాల దర్శనం!" అని ఏదో పురాతనపు డైలాగు మాత్రం వొచ్చింది నోటికి. "ఒస్తున్నానని ఉత్తరం రాసిన వాడివి కాస్త ముందుగా రాయకూడదూ? టిక్కెట్ రిజర్వేషన్ ఏ వారం రోజుల కిందటో చేయించుకుని-" అంటూ అతని మీద ఆపేక్షాపూర్వకమైన వాగ్యుద్ధం ప్రకటించేను.

సదాశివరావు నా చేతిలో ఉన్న (తను రాసిన) కార్డు లాక్కున్నాడు. రెండు సెకెండ్లపాటు ఆ కార్డులో ఈ వేపూ ఆ వేపూ ఉన్న తేదీలు చూసి, ఆ కార్డుని కళ్లకెదురుగుండా ఆడించేడు. "నువ్వే చూడు, ఉత్తరం ఎప్పుడు రాసేనో, ఎప్పుడు పోస్టు చేసేనో అదంతాను!" అన్నాడు.

చూసేను. అతను చేత్తో వేసిన తేదీ జూను 30. హైదరాబాదు పోస్టాఫీసు ముద్ర కూడా జూను ముప్ఫయ్యే. విశాఖపట్నం ముద్ర అలికేసినట్టుగా వుంది. ఏమీ పాల్తి దొరకడం లేదు. ఆ రోజు జూలై 6. ఇంక అతన్ని ఏమని తప్పుపట్టాలో తెలియక కిందామీదా పడుతూ వుంటే మా ఆవిడ మంచినీళ్ల గ్లాసుల్తో వచ్చింది. "ఈ ఉత్తరం మనకెప్పుడందింది?" అన్నాను ఘాటుగా.

"చాల్లెండి, ప్రయోజకత్వం! రాక రాక ఇంటికి మనిషొస్తేనూ, ఉత్తరం ఎప్పుడు రాసేవు, ఎప్పుడు పోస్టు చేసేవు, ఎప్పుడందింది- అంటూ రాద్ధాంతం చేస్తున్నారు!" అని మా ఆవిడ నన్ను కసిరేసి, అన్నయ్యగారూ, మీరు టీ తాగుతారా,కాఫీ కలపమంటారా?" అంది సదాశివ రావుతో.

అతని జవాబు విని మా ఆవిడ అలా వెళ్లిందో లేదో; నేను మళ్లీ తగులుకున్నాను. "అది కాదూ; జూను 30ని పోస్టు చేసిన ఉత్తరం జులై ఆరునా అందడం! ఇంతా చేసి హైదరాబాదు నించి విశాఖపట్నానికి! గట్టిగా వెయ్యి కిలోమీటర్ల దూరం లేదు! రోజూ అక్కణ్ణించి ఇక్కడికి మూడు డైరెక్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లూ, అయిదో ఆరో ఇన్‌డైరెక్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లూ కనీసం ఒక విమానం వస్తాయి. ఈ లెక్కని ఈ కార్డు గంటకి నాలుగు కిలోమీటర్ల చొప్పున ప్రయాణం చేసిందన్నమాట! హు!" అని ఆ కార్డుని చేత్తో పుచ్చుకుని రెండోచేతి గోళ్ళతో దాని మీద టప్ టప్‌మని వాయిస్తూ తప్పంతా సదాశివరావుదే అన్నంత ఫోర్సుగా అతన్ని దబాయించేను.

"ఇంకా ముందుగానే నా ప్రయాణం నిశ్చయమైంది. కాని డ్యూటీ మీద వెళ్ళమన్నారు కదా, టి.ఏ. అడ్వాన్స్ చేతికి అందకుండా ఉత్తరం రాయడం ఎందుకూ అని ఆలస్యం చేసేను" అని నేరం అంగీకరించిన ముద్దాయిలా మొహం పెట్టి చెప్పేడు సదాశివరావు.

"అలాగయితే ఒక టెలిగ్రాం ఇచ్చీవలిసింది!" అని మళ్లీ విజృంభించేను.

"మొన్న మహబూబునగరు కేంప్ వెళ్లినప్పుడు ఆ సరదా కూడా తీరిపోయింది. ఆ వూళ్లో నీలాగ నన్ను ఇంటికి రానిచ్చి ఆదరించే స్నేహితులెవరూ లేరు. అంచేత ఇంకో మూడు రోజుల్లో బయలు దేరుతాననగా మా డిపార్ట్‌మెంట్ సెక్షనాఫీసర్‌కి టెలిగ్రాం ఇచ్చేను. తీరా ప్రయాణం అంతా చేసి అతనిల్లు వెతుక్కుని వెళ్లేసరికి సరిగ్గా అదే వేళకి టెలిగ్రాఫ్ మెసింజరు తన సైకిల్ని అక్కడ ఆపేడు. "నమస్తే సార్; మీకు టెలిగ్రాం" అన్నాడు, నేనే రాఘవరావు అనుకొని. టెలిగ్రాం తొందరగా అందినా అందక పోయినా టెలిగ్రాఫ్ మెసెంజర్ని తొందరగా పంపించెయ్యాలి కదా! అలా ఆలోచించి ఆ టెలిగ్రాం నేను తీసుకున్నాను, సంతకం పెట్టి. కాలింగ్ బెల్ బటన్ నొక్కి, రాఘవరావు అనే ఆ సెక్షనాఫీసరు తలుపు తియ్యగానే టెలిగ్రాం అతని చేతికి అందించేను. అతను నా వేపు చూడకుండా టెలిగ్రాం విప్పి చదివీసుకుని; "థేంక్యూ, ఏదీ, డెలివరీ షీటు? సంతకం ఎక్కడ పెట్టాలి?" అన్నాడు. "నేను టెలిగ్రాఫ్ మెసింజర్ని కానండి. నా పేరు సదాశివరావు. హైదరాబాదులో డైరెక్టరేట్లో పనిచేస్తున్నాను. నేను ఇవాళ వస్తున్నాననీ ఎక్కడైనా వసతి చూడమనీ కోరుతూ టెలిగ్రాం ఇచ్చానే; అందలేదా సార్?" అన్నాను. రాఘవరావు గారు నెత్తికొట్టుకుని టెలిగ్రాం నా చేతికిచ్చి "సారీ, సదాశివరావు గారూ!" అన్నాడు. ఆ టెలిగ్రాం నేను మూడు రోజుల కిందట సికింద్రాబాదులో ఒక టెలిగ్రాఫ్ ఆఫీసులో ఇచ్చేను; అదే!"

"మధ్యలో ఏవో ఆదివారాలూ సెలవు రోజులూ వచ్చేసుంటాయి, పాపం" అన్నాను.

"నీకు గుర్తుందో లేదో; అఫ్‌కోర్స్, చాలాకాలం నాటి సంగతే అనుకో - ఎక్స్‌ప్రెస్ డెలివరీ అని ఒక పద్ధతి వుండేది. కవరు గానీ, కార్డుగానీ, ఇన్‌లాండు కవరుగానీ - ఒక బేడస్టాంపు, అంటే పన్నెండు పైసల స్టాంపు అంటిస్తే చాలు; ఆదివారం, సెలవు రోజు అని వెనక పెట్టకుండా తెచ్చి ఇచ్చేసేవారు. ఇప్పటి ధరల ప్రకారం కవరు ఒక రూపాయి కదా; మరో రూపాయి స్టాంపు ఎగ్‌స్ట్రా అంటిస్తే ఇప్పుడు టైము దాటిపోయిన ఉత్తరాల్ని తీసుకుంటున్నారు. అలా అనుకున్నా మరో రూపాయి స్టాంపు అంటింపించుకుని వెంటనే డెలివరీ కూడా చెయ్యొచ్చు కదా, ఆ ఆలోచన ఏదీ లేనట్టుంది. కొన్నాళ్లు రిజిస్టర్డు పోస్టుకి ప్రత్యామ్నాయంగా మూడు రూపాయలు వసూలు చేసి "రికార్డు డెలివరీ" చేసేవారు. అదీ పోయింది. ఇప్పుడు ఉత్తరం తొందరగా ఇచ్చేయాలని కోరుకుంటే స్పీడు పోస్టు ఒక్కటే శరణ్యం. దీని ఫీజు ముప్ఫయి రూపాయలు. ఇదైనా ఆదివారాలూ సెలవు రోజులూ పనిచెయ్యదు" అని నా అజ్ఞానాన్ని మళ్లీ వెళ్లబోసుకున్నాను.

"ఈ బాధలన్నీ పడలేకనే అనుకుంటాను, మా చిన్నాన్నగారు ఏదైనా కబురు తొందరగా మాకు చేరాలంటే తనే బయల్దేరి వచ్చేసేవాడు. ఏలూరు నుంచి బెజవాడ రైలు ఛార్జి రానూపోనూ కలిపి కూడా ముప్ఫయి రూపాయలు అవదు కదా" అన్నాడు సదాశివరావు.

మర్నాడు సాయంకాలం సదాశివరావు ఆఫీసు పని ఆనాటికి చాలించుకుని మా

ఇంటికొచ్చేడు. అతనొచ్చిన పది నిమిషాలకి సీతారామ్మూర్తి అని ఒకాయన స్కూటరేసుకుని వచ్చాడు. "మీరు 11వ తేదీని. హైదరాబాదు వెళ్తారు కదా. ఈ పుస్తకం మన నిరంజనరావుగారికి ఇచ్చేద్దురూ, ప్లీజ్!" అని ఓ అరవై పేజీల అచ్చుపుస్తకం సదాశివరావుకి అందించేడు.

"నో నో! నేను పదకొండో తేదీని హైదరాబాదు చేరినా ఆ రోజు జర్నీడే కనక ఆఫీసుకి వెళ్లను. 12 ఆదివారం. అంటే, నా ద్వారా ఈ పుస్తకం పంపితే 13కి గాని ఇది ఆయనకి అందదు. ఒకవేళ ఆయన 13 నాడు సెలవు పెట్టేడనుకోండి - ఎందుకొచ్చిన గొడవగాని, చక్కగా బుక్‌పోస్టులో పంపించీయండి!" అనేశాడు సదాశివరావు.

"అయ్యో!" అని ఆ సీతారామ్మూర్తి నెత్తికొట్టుకున్నాడు. "బుక్‌పోస్టులో ఓసారి పంపడం అది ఆయనకి అందకపోవడం జరిగిపోయాయండీ. నేనంటున్నానని ఏమీ అనుకోకండి. బుక్‌పోస్టులో బుక్స్ తప్ప మరేమైనా సరే ఐతేనే అందే అవకాశం వుంది".

"మరేమైనా అంటే?"

"గ్రీటింగ్ కార్డులూ పెళ్లి శుభలేఖలూ అలాంటివన్నమాట".

"చాల్లెండి, చెప్పేరు. మా తమ్ముడు మొన్న ఉగాదికి నాకు పంపుదామని ఒక అద్భుతమైన గ్రీటింగ్ కార్డు ఎనిమిది రూపాయలకి కొని పంపేడుట. నాకు అందనే లేదు" అని నేను కలగజేసుకున్నాను.

సీతారామ్మూర్తి నవ్వేడు. "అంత అద్భుతమైనవైతే చెప్పలేం లెండి. ఏదో సాదా సీదావి అయితే అందుతాయి".

"సర్లేవయ్యా మూర్తీ. నీ పుస్తకం నిరంజనరావుకి రిజిస్టర్డ్ పోస్టులో పంపు. ఎందుకు అందదో చూద్దాం!"

"దమ్మిడీ ముండకి ఏగానీ క్షవరం అని అనేవారు. ఈ పుస్తకం ధరేమో ఏడు రూపాయలూనూ, దీన్ని అవతలి మనిషికి అందేటట్టు పంపాలంటే పదిహేను రూపాయలూనూ! పుస్తకం రాసి అచ్చేయించుకున్న పాపానికి ఎన్ని అవస్థలో! మొన్న ఒక జాతీయ గ్రంథాలయం నించి నాకొక నోటీసులాంటి లెటరొచ్చింది. ఒరే సీతారామ్మూర్తీ, నువ్వు ఫలానా పేరుతో ఒక పుస్తకం వేసేవుట కదా, 1954లో మేం చేయించుకున్న ఒకానొక చట్టం ప్రకారం నువ్వు ఆ పుస్తకం ఒక కాపీ మాకు ఫ్రీగా ఇవ్వాలి; లేకపోతే నీకు శిక్ష -అంటూనూ. అయ్యా, మీ చట్టం ప్రకారం పుస్తకం ఫ్రీగా ఇమ్మని ఉంది గాని పోస్టేజి గురించి ఏమీ చెప్పలేదు గనక మీరు నా దగ్గిరికి ఒక మనిషిని పంపినా సరే, లేదా 15 రూపాయలు పోస్టేజి నిమిత్తం పంపినా సరే మీ ఇష్టం - అని జవాబు రాసేను. పోస్టేజి అన్నమాట చూసీ చూడగానే రెండూ మూసుకుని ఊరుకున్నారు, అంతే!" ... సదాశివరావు నవ్వుకుంటూ ఆ పుస్తకం బాధ్యత తీసుకున్నాడు.

ఆ మర్నాడు నేను మా ఆఫీసు నుంచీ, సదాశివరావు వాళ్ల డిపార్టుమెంట్ ఆఫీసు నుంచీ బయలుదేరి - సరిగ్గా ఒక్కసారే పోస్టాఫీసు గేటు దగ్గిరకొచ్చి కలుసుకున్నాం. "ఉండు, కలిసి వెళదాం ఈ లెటర్స్‌కి స్టాంపులంటించి పోస్టు చెయ్యాలి." అన్నాడు. "లోపల స్టాంపులుంటాయి గాని జిగురు ఉండదు. నోట్లో నాలిక ఉంటేనే లోపల అడుగుపెట్టు!" అన్నాను.

"నాలిక తడితో స్టాంపులంటించడం అనే సంస్కృతికి కనీసం వందేళ్ల చరిత్ర వుంది"

అన్నాడు సదాశివరావు. "ఒక డాక్టరుగారు ఒక పేషంటుని పరీక్ష చేస్తూ, 'ఏదీ, నాలిక జాపు, ఇంకా జాపు, - అదేంటి, లోపల?... ఏదో స్టాంపులాగా ఉందే?' అన్నాడట. దానికా పేషంటు, 'అమ్మా! ఈ స్టాంపు ఇక్కడుందా? ఉదయం నుంచీ వెతుక్కు చస్తున్నాను!' అన్నాట్ట. ఈ కార్టూన్ 1946లో ఒక పత్రికలో వచ్చిందని మా నాన్నగారు చెప్పేరు." ★

# 64. ముప్ఫయి ఏళ్ళ అనంతరం

నేను గుంటూరు జిల్లాలో పని చేస్తూ వుండిన రోజుల్లో ఒకసారి ఒంగోలు ప్రాంతంలో ఉన్న అమ్మనబ్రోలు అనే వూరికి క్యాంపు వెళ్లవలసి వచ్చింది. ఒంగోలు సబ్‌కలెక్టరు గారిని చూసే పనికూడా ఉంది. ముందుగా ఒంగోలు వెళ్లి సబ్‌కలెక్టర్‌గార్ని చూసేసి అక్కణ్ణుంచి అమ్మనబ్రోలు వద్దామని నేను వేసుకున్న ప్లాన్; ఒంగోలు తాలూకా ఆఫీసులో పనిచేస్తూ వుండిన సీతారామయ్య ఉన్నట్టుండి గుంటూరు రావడంతో తారుమారయింది. "నాక్కూడా అమ్మనబ్రోల్లో పనుంది. ఇద్దరం అమ్మనబ్రోలు వెళిపోదాం. ఈ సాయంకాలం చేరుకుంటాం కదా. మీ ఇనస్పెక్షన్ రేపు ఉదయం చేసుకోండి. ఈలోపుగా నాపన్లు చక్కబెట్టుకుంటాను. ఇద్దరం కలిసి రేపు సాయంకాలానికి ఒంగోలు చేరుకోవచ్చు" అని అతను సలహా ఇచ్చేడు.

"ఆన్‌డ్యూటీ మీద" వెళ్లాను కనక ట్రావెలర్స్ బంగళాలో బసచేసేను. మర్నాడు నేను చేయవలసిన ఇనస్పెక్షన్‌కి కబురు పెట్టడం మందీ మార్బలాన్నీ మోపుచెయ్యడం యివన్నీ సీతారామయ్య ఆ రాత్రిలో పూర్తి చేసేడు. నా వెంట డ్యూటీ మీద వచ్చిన మా ఆఫీసు ప్యూన్ నాయరు సాయంతో.

తెల్లవారి లేచేటప్పటికి బంగళా ఆవరణలో జీపు నిలబెట్టి వుంది. వరండాలో ఉన్న వాచ్‌మన్‌ని పిల్చి అడిగితే "సబ్‌కలట్రుగారు రాత్రి బాగా పొద్దుపోయాక వచ్చారండి" అని చెప్పేడు. "అయ్యగారు నిదరబోతున్నారండి. ఏడున్నరకి లెగుస్తారంట."

ఇప్పుడెలా వుందో తెలియదు గాని, ఆరోజుల్లో అమ్మనబ్రోలు ట్రావెలర్సు బంగళా ప్రాంతంలో ఎక్కడా కాఫీహోటళ్లుగాని, కనీసం "బడ్డీ టీకొట్టు", "పాక విలాస్-" ఏదీ కూడా వుండేది కాదు. అంచేత మా నాయర్ నాకు టిఫినూ కాఫీ తేవడానికి ఊళ్లోకెడుతూంటే "ఎందుకయినా మంచిది; కొంచెం ఎక్కువ తీసుకురా" అని చెప్పేను. సబ్ కలెక్టర్‌గారు లేచేసరికే వచ్చేశాడు చెప్పినవన్నీ కట్టించుకుని.

నేననుకున్నంతా అయింది. సబ్‌కలెక్టరు గారు లేచి మొహం కడుక్కుని స్నానం చేసి ఇవతలి కొచ్చి కూర్చునే సరికి కూడా కరణం గారికి కబురు చెప్పడానికి వెళ్లిన ఆయన ప్యూన్‌గాని, జీపు డ్రయివరు గాని రాలేదు. వాచ్‌మన్ నేనున్న గది తలుపు తెరుచుకుని లోపలికొచ్చి "ఐగారు లేచేరండి. వారి ప్యూన్ కర్నంగారింటికెళ్లి ఇంకా రాలేదండి. టిఫినూ కాఫీ కోసం నాయరు గార్ని పంపించండయ్యా" అన్నాడు.

"తెచ్చాంగా" అన్నాడు మా నాయరు.

నేను వరండాలో కొచ్చాను. సబ్ కలెక్టరుగారు ఈజీ చేర్ మీద "ప్లాంకు" వేసుకుని